సాంకేతిక రంగంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులు సాంకేతిక రంగంపై దృష్టి సారించి విజయాలు సాధించాలని కెజిఆర్‌ఎల్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఆదిత్య డిగ్రీ కళాశాలలో వశిష్ట 2కె 24 టెక్నికల్ ఫెస్ట్‌ను ఆదిత్య విద్యాసంస్థ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పోస్టర్ ప్రెజంటేషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్, క్విక్ ఇంటర్వ్యూ, డిబెట్, క్విజ్, డ్రాయింగ్ అంశాల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఆదిత్య విద్యార్థులు వివిధ అంశాల్లో చక్కని ప్రతిభ కనబర్చారని, వీరికి మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రిన్సిపల్ కమలాకర్ మాట్లాడుతూ అన్ని విభాగాల్లో సాంకేతిక సౌకర్యాలతో ఉత్తమ విద్యనందిస్తున్నామని, విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం అధ్యాపకులకు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి డాక్టర్లపై.. జిఒ 85 కత్తి..!

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు ఎదురుదెబ్బ

సర్వీస్ కోటాలో పీజీ సీట్లు 15 శాతానికి కుదింపు

ఐదు బ్రాంచ్‌లకే పరిమితం చేయడం మరో దారుణం

పిహెచ్‌సి డాక్టర్ల పీజీ ఆశలకు గండి

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత ఏర్పడే ప్రమాదం

ప్రభుత్వం పునరాలోచించాలని వైద్యుల నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పిహెచ్‌సి (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) డాక్టర్ల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పని చేసే వైద్యులపై కక్ష కట్టినట్లు ముందుకు సాగుతోంది. పేదలకు వైద్య సేవలందించే వైద్యులపై అత్యంత కాఠిన్యం ప్రదర్శిస్తోంది. పిహెచ్‌సి వైద్యులకు సర్వీస్ కోటాలో దక్కాల్సిన పీజీ సీట్లను తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 85 వైద్యుల మెడపై కత్తిగా మారింది. పిహెచ్‌సి వైద్యుల పీజీ చదువుల ఆశలను ప్రభుత్వం చిదిమేసే పరిస్థితి నెలకొంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలపై తీవ్ర ప్రభావం పొంచి ఉంది. జిఒను రద్దు చేసి అన్ని వైద్యకోర్సుల బ్రాంచ్‌ల్లోనూ తమకు ఇస్తున్న కోటాను పునరుద్ధరించాలని పిహెచ్‌సి వైద్యులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఏలూరు డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పిహెచ్‌సి వైద్యులు

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పేదలకు అందే వైద్యసేవలకు ఇబ్బందులు సృష్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే పిహెచ్‌సి వైద్యులకు మరిన్ని సదుపాయాలు, అవకాశాలు కల్పించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వం తెచ్చిన జిఒ 85నే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. ఏలూరు జిల్లాలో 62 పిహెచ్‌సిలు ఉండగా 130 మంది వైద్యులు ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 41 పిహెచ్‌సిలు ఉండగా 110 మంది వరకూ వైద్యులు సేవలందిస్తున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పేదలకు వైద్యసేవలు అందించడంలో పిహెచ్‌సి వైద్యులదే కీలక పాత్ర. నిరుపేదలకు పిహెచ్‌సిలు ఎంతగానో వైద్యసేవలు అందిస్తున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతో గతంలో ప్రభుత్వాలు కొన్ని అవకాశాలను కల్పించాయి. గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు పని చేసిన పిహెచ్‌సి వైద్యులు పీజీ విద్యను అభ్యసించేందుకు నీట్ పరీక్ష రాస్తే వీరికి అన్ని వైద్యకోర్సుల బ్రాంచ్‌ల్లోనూ సర్వీస్ కోటా కింద 30 శాతం సీట్లు ఇచ్చేవిధంగా అవకాశం కల్పించారు. చాలాకాలంగా ఈ సర్వీస్ కోటా కొనసాగుతోంది. ప్రభుత్వం ఈ ఏడాది జులై 20న జిఒ 85 తీసుకొచ్చింది. ఈ జిఒ ప్రకారం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు లభించే సర్వీస్ కోటా సీట్లను 15 శాతానికి కుదించారు. ఆ సీట్ల సంఖ్యను కూడా అన్ని వైద్య కోర్సుల బ్రాంచ్‌లకు కాకుండా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజిస్ట్, పిడియాట్రిక్స్, అనస్థియా వంటి ఐదు బ్రాంచ్‌లకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు జిఒలో పేర్కొన్నారు. రేడియాలజిస్ట్, డెర్మటాలజిస్ట్ వంటి ఇతర బ్రాంచ్‌లకు వర్తించకుండా చేసింది. పిహెచ్‌సిల్లో పని చేసే వైద్యులకు ఇది మెడపై కత్తిగా మారింది. సీట్లు తగ్గిపోవడంతో ఎంతోమంది వైద్యులు గవర్నమెంట్ కాలేజీలో సీట్లు దక్కించుకోలేని దుస్థితి ఏర్పడనుంది. గతంలో కొనసాగించిన 30 శాతం సీట్లను అన్ని బ్రాంచ్‌లకు అమలు చేయాలని గడిచిన 11 రోజులుగా విధులను బహిష్కరించి వైద్యులు నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకుండా మొండిగా ముందుకు సాగుతోంది. దీంతో వైద్యులు లేక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం కుంటుపడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే పిహెచ్‌సి వైద్యుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ వైద్యసేవలకు జిఒ 85 ప్రమాదం

ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ వైద్యం అత్యంత వేగంగా విస్తరిస్తోంది. వైద్య విద్యను అభ్యసించిన వారు పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పని చేసేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసేందుకు వెనుకాడుతున్నారు. పిహెచ్‌సి డాక్టర్లకు పీజీ సీట్లలో సర్వీస్ కోటా ఇవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు మరింత మెరుగుపడుతున్న పరిస్థితి నెలకొంది. సర్వీస్ కోటాను తగ్గిస్తే యువ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పని చేసేందుకు విముఖత చూపే పరిస్థితి ఏర్పడనుంది. అదే జరిగితే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం కుంటుపడే ప్రమాదం ఏర్పడనుంది. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే పిహెచ్‌సి వైద్యుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని అంతా కోరుతున్నారు.

వైద్యుల నిరసనలపై నిర్బంధం..

జిఒ 85 వెనక్కి తీసుకోవాలంటూ పిహెచ్‌సి వైద్యులు చేపట్టిన నిరసనలపై ప్రభుత్వం నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తోంది. నిరసనలకు అధికారులు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద నిరసనలు చేయకుండా అడ్డుపడుతున్న పరిస్థితి ఉంది. దీనిపై పిహెచ్‌సి వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనకు అనుమతులు లేవంటూ శనివారం డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పిహెచ్‌సి వైద్యులు అంతా అక్కడికి చేరుకుని అలా ఉండిపోవాల్సి వచ్చింది. తర్వాత జిఒ 85కు వ్యతిరేకంగా నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకూ నిరసనలు ఆపేది లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

పూర్వపు పద్ధతి కొనసాగించాలి..

పూర్ణచంద్రకుమార్, ఎపి పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్, జనరల్ సెక్రటరీ, ఏలూరు

ఇప్పటి వరకూ కొనసాగించిన విధంగానే సర్వీస్ కోటాలో పిహెచ్‌సి వైద్యులకు 30 శాతం సీట్లు ఇవ్వాలి. ఐదు బ్రాంచ్‌లకు పరిమితం చేయకుండా అన్ని క్లినికల్ బ్రాంచ్‌లకు వర్తింపజేయాలి. జిఒ 85ను వెనక్కి తీసుకోవాలి. గ్రామీణ వైద్యం మెరుగుపడేలా ప్రభుత్వం ముందుకు సాగాలి.

జిఒ 85 అమలైతే ప్రభుత్వ కళాశాలల్లో సీటు కష్టం

డాక్టర్ కళ్యాణి మహేశ్వరి, పిహెచ్‌సి, పూళ్ల

గడిచిన మూడున్నరేళ్లుగా పూళ్ల పిహెచ్‌సిలో డాక్టర్‌గా పని చేస్తున్నాను. 2024 ఆగస్టులో నీట్ పరీక్ష రాశాను. పరీక్ష క్వాలిఫై అయ్యాను. ప్రభుత్వం జిఒ 85 తెచ్చి 30 శాతం సీట్లను 15 శాతానికి తగ్గించింది. ప్రభుత్వ కళాశాలలో సీటు రాకుండా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. జిఒను వెంటనే ఉపసంహరించుకుని పిహెచ్‌సి వైద్యులకు న్యాయం చేయాలి.

సీట్ల కుదింపుతో పీజీ అవకాశాలకు దెబ్బ

డాక్టర్ శ్రీలక్ష్మి, పిహెచ్‌సి, గుండుగొలను

ఈ ఏడాది నీట్ పరీక్ష రాశాం. ప్రభుత్వం సర్వీస్ కోటా సీట్లను 15 శాతానికి కుదించడంతో నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. సీట్ల కుదింపుతో పీజీ చదివే అవకాశాలను పిహెచ్‌సి వైద్యులు కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది. ప్రభుత్వ కాలేజీలో సీట్లు దక్కే అవకాశం ఉండదు. వెంటనే జిఒ 85ను నిలుపుదల చేయాలి.

ఎంఎల్‌ఎపై దళిత సంఘాల నేతలు ఆగ్రహం

అంబేద్కర్ బ్యానర్ తొలగింపు సరికాదంటూ ఆందోళన

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజల చేత ఎన్నికైన ఎంఎల్‌ఎ అలా ప్రవర్తించడం దారుణమని రాష్ట్ర బహుజన జెఎసి అధ్యక్షులు కోనా జోసఫ్ అన్నారు. ఏలూరుపాడులో నాగేంద్రస్వామి విగ్రహం వద్ద ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు అంబేద్కర్ బ్యానర్ తొలగించడంపై దళిత సంఘాల నేతలు శనివారం ఆందోళన చేపట్టారు. ఏలూరుపాడులో శుక్రవారం సాయంత్రం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలో కొంతమంది జనసేన నాయకులు ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లారు. నాగపాము విగ్రహానికి ఎదురుగా అంబేద్కర్ బ్యానర్ ఏర్పాటుతో యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్‌ఎకు వివరించారు. దీనిపై ఎంఎల్‌ఎ వెంటనే స్పందించి అంబేద్కర్ బ్యానర్‌ను తొలగించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఏలూరుపాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద పలు దళిత సంఘాల నేతలు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు పోలీస్ బలగాలతో ఏలూరుపాడు చేరుకుని ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

ఫ్లెక్సీ తొలగింపు అన్యాయం : సిపిఎం

ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు తొలగించడం రాజ్యాంగాన్ని అవమానించినట్లు అవుతుందని సిపిఎం మండల కమిటీ శనివారం తీవ్రంగా ఖండించింది. మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు ఎంఎల్‌ఎ పాల్పడడం సరికాదన్నారు. అంబేద్కర్ గౌరవాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎంఎల్‌ఎపై ఉందన్నారు. సామాన్య పౌరుడిలా వ్యవహరించడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా ఎంఎల్‌ఎ పునరాలోచన చేసి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలన్నారు.

ఎంఎల్‌ఎపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ఆచంట : కాళ్ల మండలంలో ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంఎల్‌ఎగా గెలుపొందడానికి అన్ని వర్గాల వారూ కృషి చేశారని తెలిపారు. అంబేద్కర్ ఫ్లెక్సీని చించి వేయటం యావత్తు దళిత జాతిని అవమానించడమేనని విమర్శించారు. ఎంఎల్‌ఎపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్‌ఎ వ్యవహారశైలి మార్చుకోవాలి : కెవిపిఎస్

భీమవరం : ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు వ్యవహార శైలి ప్రజల మధ్య కుల, మత ఘర్షణలు రెచ్చగొట్టేలా ఉందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు తెలిపారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో జరిగిన ఘటనపై శనివారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్రాంతిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరుపాడులో నాగేంద్రస్వామి గుడి వద్ద దారికి అడ్డుగా ఉన్న అంబేద్కర్ ఫ్లెక్సీని ఎంఎల్‌ఎ స్వయంగా తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఫ్లెక్సీ ఏర్పాటు వల్ల ఇబ్బంది ఉంటే కట్టినవారికి చెప్పడం, అధికారులను ఆదేశించడం చేయాలని, ప్రజాప్రతినిధి అలా వ్యవహరించడం సరికాదని తెలిపారు. మతానికి, ప్రభుత్వానికి సంబంధం లేదని అవగాహన అన్న ఎంఎల్‌ఎకు కులానికి, మతానికి సంబంధం లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అవగాహన లేదా అని ప్రశ్నించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటమేంటని తెలిపారు. ఉండి నియోజకవర్గంలో దళితులు ఓట్లు వేయకుండా ఎంఎల్‌ఎగా గెలిచారా అని ప్రశ్నించారు. ఇకనైనా నియోజకవర్గం ప్రజల మధ్య కుల, మత ఘర్షణలకు, విభజనకు దారితీసేలా వ్యవహరించే వైఖరిని ఎంఎల్‌ఎ మానుకోవాలని సూచించారు.

ఏలూరుపాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

ఫ్లెక్సీ తొలగింపుపై ఎంఎల్‌ఎ వివరణ

కాళ్ల : ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీ వివాదంపై శనివారం స్పందించారు. ఏలూరుపాడు తన అమ్మమ్మ ఊరు అని, శుక్రవారం ఏలూరుపాడులో పలు ప్రారంభోత్సవాలు నిర్వహించి వెళ్తున్న సమయంలో నాగేంద్ర స్వామి గుడి మూసేసి అంబేద్కర్ ఫ్లెక్సీ కట్టడాన్ని చూశానని తెలిపారు. గుడిపై ఇద్దరు కూర్చుని ధూమపానం చేశారని, అది చూసి ఫ్లెక్సీని తొలగించానని చెప్పారు. అంబేద్కర్ అంటే తనకు చాలా భక్తి అని స్పష్టం చేశారు.

మడమ తిప్పుతున్నారు..!

'మేం మాట తప్పం.. మడమ తిప్పం..' వైసిపి నేతలు గతంలో తరచూ మాట్లాడే మాట ఇది. అయితే అధికారం దూరం కావడం, ఆరోపణలు వరుసగా చుట్టుముడుతుండటంతో రెండు జిల్లాల్లోని ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు మడమ తిప్పుతున్నారు. అదే సమయంలో టిడిపి, జనసేన నేతలు వారిని అక్కున చేర్చుకునేందుకు పోటీ పడుతుండడం గమనార్హం.

జిల్లా కేంద్రమైన ఏలూరులో వరుస రాజీనామాలతో కకావికలమైన ప్రతిపక్ష వైసిపి తాజాగా పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే సమస్య ఎదుర్కొంటుంది. ఏలూరులో మాజీ మంత్రి ఆళ్ల నాని పార్టీకి గుడ్‌బై చెప్పాక మేయర్, కార్పొరేటర్లు, ఇడా ఛైర్‌పర్సన్ వరకూ అంతా టిడిపి గూటికి క్యూ కట్టిన సంగతి తెలిసిందే. తాజాగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతుల వ్యవహారం టిడిపి, జనసేన నడుమ దూరం పెంచిందనే చెప్పొచ్చు. జనసేనలో చేరుతున్నట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్ దంపతులు ప్రకటించాక టిడిపి నేతలు గుట్టుగా వ్యవహారం సాగించి వారిని టిడిపిలో చేర్చుకున్నారు. దీంతో జనసేన నేతలు చేర్పింపుల్లో దూకుడుగా వ్యవహరించేందుకు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే పక్కచూపులు చూస్తున్న వైసిపి మాజీ ఎంఎల్‌ఎలు, ఇతర ప్రజాప్రతినిధులతో అటు టిడిపి, ఇటు జనసేన నేతలు పోటాపోటీగా మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మాజీ ఎంఎల్‌సి, మాజీ జెడ్‌పి ఛైర్మన్ మేకా శేషుబాబుపై వైసిపి అధిష్టానం వేటు వేయడం సంచలనం సృష్టించింది. దీనిపై ఆయన కూడా ఏమాత్రం వెనక్కు తగ్గకుండా పార్టీకి సంబంధం లేని వ్యక్తుల పెత్తనం వల్లే గత ఎన్నికల్లో ఘోర పరాజయం మూటగట్టుకన్నామని, ఆ వ్యక్తులు మాత్రం కోట్లు కూడబెట్టుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులుగా ముదునూరి ప్రసాదరాజును నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. వైసిపి ఎంఎల్‌సిలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ సైతం ఎక్కడా కానరావడం లేదు. ఆ పార్టీకి చెందిన కొయ్యే మోషేనురాజు ఒక్కరే శాసన మండలి ఛైర్మన్ బాధ్యతల్లో జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మరికొందరు మాజీ ఎంఎల్‌ఎలు, నేతలు వైసిపిని వీడనున్నట్లు ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. వీరిలో కొందరు టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకోగా మరికొందరు జనసేన వైపు మళ్లుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా రెండు జిల్లాల్లో వైసిపి తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

వంట నూనె ధరలు సలసలా కాగుతుండటంతో వంటింట్లో ధరల మంట రేగింది. మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక గతంకన్నా సీట్లు తగ్గినా మిత్రపక్షాల అండతో దుందుడుకుగానే వ్యవహరిస్తున్నారనడానికి నూనె ధరల పెరుగుదలకు కారణమయ్యే చర్యలు చేపట్టడమే. దీన్ని కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు నూనె దిగుమతులపై సుంకం పెంచారని గొప్పగా ప్రచారం చేయడం గమనార్హం. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారి సమస్యలను కచ్చితంగా పరిష్కరించాల్సిందే. ఆ పేరుతో వంటనూనె వినియోగదారులపై భారం మోపడం దారుణమని, రైతులకు వినియోగదారులకు మధ్య ఉన్న సత్సంబంధాన్ని దెబ్బతీయడమేనని వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

- వివిఎస్‌వి.ప్రసాద్

ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక అవగాహన

28న అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో లబ్ధిదారులకు కార్యక్రమాలు

గృహనిర్మాణ పనుల్లో ఉపాధి హామీ కింద 90 రోజుల పని దినాలు కల్పన

జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మంజూరైన గృహాలన్నింటినీ లక్ష్యాల మేరకు పూర్తి చేయడానికి మన ఇల్లు-మన గౌరవం పేరుతో ప్రత్యేక గృహ నిర్మాణ అవగాహనా కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నాగరాణి 'మన ఇల్లు-మన గౌరవం' అవగాహనా కార్యక్రమంపై హౌసింగ్ ఇంజినీర్లు, ఎంపిడిఒలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒపిఆర్‌డిలతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 28న అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో రూఫ్ లెవెల్ వరకు వచ్చిన 3,242 వేల ఇళ్లను అక్టోబర్ 24 నాటికి, అలాగే బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న 5,512 ఇళ్లను 2025 మార్చి 25 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. మార్చి 25 తర్వాత పిఎంఎవై 1.0 హౌసింగ్‌కు నిధులు మంజూరు కావని, అనంతరం పిఎంఎవై 2.0 హౌసింగ్ ప్రోగ్రామ్ ప్రారంభమవుతుందని అన్నారు. పిఎంఎవై అర్బన్, పిఎంఎవై గ్రామీణ్‌లో భాగంగా మొదలుకాని ఇళ్ల నిర్మాణాలను వెంటనే మొదలు పెట్టాలని, సంబంధిత నియోజకవర్గస్థాయి ప్రత్యేకాధికారి మండల ప్రత్యేక అధికారులు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలని, నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. దీనిలో ఎలాంటి సందేహాలున్నా హౌసింగ్ పీడీని సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ బి.పిచ్చయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

గీత వృత్తిని నిర్వీర్యం చేయొద్దు

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడకుండా లక్షల మంది గీత కార్మికులకు జీవనాధారంగా ఉన్న కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ, కల్తీ మద్యం అమ్మే బడా వ్యాపారులతో సంబంధాలు ఉన్న ఎక్సైజ్ అధికారులు ఏస్థాయి వారైనా చర్యలు తీసుకొని ఆ శాఖను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా రాష్ట్రంలో ఆపదలో ఉన్న గీత కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. గీత కుటుంబాలకు ఉపాధి పెంచే విధంగా నూతన కల్లు విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. కల్తీలేని ప్రకృతి పానీయం, ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా ఉపయోగపడే ఆహారం వంటి తాటికల్లును, తాటి ఉత్పత్తులను ప్రోత్సహించి ప్రభుత్వమే ప్రచారం చేయాలన్నారు. వృత్తిలో ప్రమాదాలను నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నట్లుగా సేఫ్టీ మోకులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీమాతో సంబంధం లేకుండా ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబానికి తక్షణం దహన సంస్కారాలకు రూ.30 వేలు, గాయాలైన వారికి వైద్య ఖర్చులకు రూ.25 వేలు కార్పొరేషన్ ద్వారా ఇవ్వాలని, వృత్తి చేస్తున్న వారందరికీ ద్విచక్ర మోటార్ సైకిల్ ఇవ్వాలని కోరారు. తాటిచెట్టు ద్వారా 200 రకాల ఉత్పత్తులను తయారు చేయొచ్చని, తాటి బెల్లం, ఫామ్ డ్రింక్స్, సర్ఫ్ వంటి అనేక బై ప్రొడక్ట్స్ తయారు చేయొచ్చనే సైంటిస్టుల సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆరోగ్యానికి హానికరం అని తెలిసి అప్పటికీ ఆదాయం కోసం బీరు, బ్రాందీ, విస్కీ, చీప్ లిక్కర్‌ను ప్రోత్సహిస్తూ తాటి కల్లును చిన్నచూపు చూడడం భావ్యం కాదన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి, సహాయ కార్యదర్శి బొక్కా చంటి, కడలి పాండు, కమిటీ సభ్యులు దాసరి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, చింతపల్లి చిన్నవేరా స్వామి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్‌ఎ బొలిశెట్టికి కార్మికుల వినతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని, పని భద్రత కల్పించాలని కోరుతూ మిడ్ డే మిల్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల కమిటీ నేతలు శనివారం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ముందుగా యూనియన్ తరపున ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు చింతకాయల బాబూరావు, సిరిపరపు రంగారావు, కండెల్లి సోమరాజు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ఎంఎల్‌ఎకు తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.నాగమణి, ఎన్.అరుణ, తులా లక్ష్మి, పల్లి కవిత, పి.జయమ్మ, కె.దుర్గాదేవి, ఇ.పుష్పావతి, మిద్దె లక్ష్మి, మానూరి గోపమ్మ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

డిఎస్‌పి ఎల్.మురళీకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ 2కె 24 లోగోను నరసాపురం డిఎస్‌పి ఎల్.మురళీకృష్ణ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని, జీవితంలో అత్యంత కీలకమైన విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఉండాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, మహాత్మ గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 27, 28, 29 మూడు రోజుల పాటు లయన్స్ క్లబ్ వేదికగా ఈ ఫెస్ట్ జరుగుతుందన్నారు. నరసాపురం సబ్‌డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో అన్ని కళాశాల విద్యార్థులకు అనుమతి ఉంటుందన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కలిసి 10 రకాల అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. నరసాపురం పట్టణ విద్యావేత్తలు, మేధావులు, ప్రజలు, విద్యార్థులు ఈ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బి.గణేష్, పట్టణ ఉపాధ్యక్షులు పి.ధనుంజయ్, ఇ.సన, సభ్యులు ఎం.చందు, జి.ధీరజ్, జి.సిరి పాల్గొన్నారు.

స్టూడెంట్ ఫెస్ట్ లోగో ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి మురళీకృష్ణ

పౌష్టికాహార సాధనే లక్ష్యం

తాడేపల్లిగూడెం: పౌష్టికాహార సాధనే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని జనసేన వీర మహిళ గారగా విష్ణుప్రియ పేర్కొన్నారు. మండలంలోని మాధవరం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషకాహార మహోత్సవాల సందర్భంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచి కొలగాని పరిమళ, హెల్త్ సూపర్వైజర్ సిహెచ్ విఎస్ మని, అంగన్వాడీ కార్యకర్తలు చంద్రావతి, మహాలక్ష్మి, హేమలత, ఉదయలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

మొగల్తూరు: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఒ బి.దుర్గ అన్నారు. మండలంలోని రామన్నపాలెం సెక్టార్లో ఇందిర కాలనీలోని కమ్యూనిటీ భవనంలో పౌష్టికాహారం మాసోత్సవాలను నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

'అందుబాటులో లేని వైద్యులు'

తణుకు: అత్తిలి మండలం మంచిలి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బట్టు నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో ప్రజలు చాలా మంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రజలు వస్తుంటే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా ఉండే పిఎంపి, ఆర్ఎంపిలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. సరైన వైద్యం అందక ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. కొంతమంది ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు సురక్షిత తాగు నీరందించాలి

శాఖా మహాసభల్లో తీర్మానాలు

పోడూరు: జిన్నూరు గ్రామంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతాగోపాలన్ అన్నారు. పోడూరు మండలం జిన్నూరు శాఖ మహాసభ తాతాబత్తుల గాంధీ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గాంధీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణ రాజు చిత్రపటాలకు కొవ్వొత్తి నరసింహమూర్తి, దాడి గౌరమ్మ, మరిశెట్టి సన్యాసిరావు పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన శాఖా మహాసభలో గోపాలన్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాల నుంచి జిన్నూరు గ్రామంలో ప్రజలకు సురక్షితమైన మంచినీరు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం కల్పించుకుని శుద్ధి చేసిన తాగునీటిని ఇంటింటికీ కులాయిల ద్వారా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన శాఖా కార్యదర్శిగా కొవ్వొత్తి నరసింహమూర్తిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేతలు కిలారి సాంబయ్య, వెలుదురు నాగేశ్వరరావు, మారిశెట్టి సన్యాసిరావు, కేతల వెంకటేశ్వర్లు, గుబ్బల గంగాచలం, చిదపపు ఆంజనేయులు, కలిశెట్టి సింహాచలం పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ప్రజలపై భారాలు.. కార్పొరేట్లకు లాభాలే ధ్యేయంగా బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్వి గోపాలన్ విమర్శించారు. శనివారం మండలంలోని తోకతిప్ప గ్రామంలో శాఖా మహాసభల సందర్భంగా సిపిఎం మాజీ మండల కార్యదర్శి రేవు రామకృష్ణ జెండా ఆవిష్కరించి శాఖా మహాసభలు ప్రారంభించారు. ఈ శాఖా మహాసభలకు తిరుమాని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్వి గోపాలన్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, నూనె ధరలు, నిత్యవసర సరుకుల ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని, మంచినీళ్ల ఫిల్టర్ చేయాలని తీర్మానించారు. పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్, బొడ్డు లక్ష్మీపతి, బొడ్డు ఏసు, తిరుమాని సూర్యనారాయణ, పొన్నమండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

నరసాపురం: మండలంలోని సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా నరసాపురం డిఎస్‌పి ఎన్‌విఎం మూర్తికృష్ణ, నరసాపురం రూరల్ సిఐ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులు చెడువ్యసనాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, ప్రతి విద్యార్థి నిత్యం ఏదో ఒక పని చేస్తూ ఉంటే చెడు ఆలోచనలు మెదడులోకి రాకుండా ఉంటాయని అన్నారు. ప్రతీ విద్యార్థి నిరంతరం కష్టపడి చదివితే రాబోయే జీవితంలో సుఖమైన జీవితం, ఆనందమైన జీవితం ప్రతి విద్యార్థి పొందుతారని తెలియజేశారు. 21 సంవత్సరాలు నుంచి ప్రతి విద్యార్థి ఐఎఎస్, ఐపిఎస్, గేట్ లాంటి పోటీ పరీక్షలకు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకుని, ఉద్యోగాలు పొందవచ్చని తెలియజేశారు. ఈ సదస్సులో కళాశాల ఛైర్మన్ కె.వి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపిచంద్ పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి : జెసి

నరసాపురం రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా మందుగుండు సామాగ్రి తయారు చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలో మందుగుండు సామాగ్రి తయారు చేసే యూనిట్లను శనివారం జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. బాణాసంచా తయారీ చేసే యూనిట్లను ఉద్యమాలు వెలిగిస్తు ముందుకెళ్లి, వెలిగిస్తు రాంబాబును బాణాసంచాలు తయారుచేసేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, 18 సంవత్సరాలు లోపు పిల్లలను బాణాసంచా తయారీలో ఉపయోగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఫైర్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మందుగుండు సామాగ్రి తయారు చేసే వారి యూనిట్లను తరచూ తనిఖీలు చేయాలని రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలను ఆదేశించారు. ఆయన వెంట నరసాపురం తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, డిప్యూటీ తహశీల్దార్ బి.సీతారత్నం, వీఆర్‌ఒ చిరంజీవి, పోలీస్ ఫైర్ సిబ్బంది ఉన్నారు.

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

మొగల్తూరు: సముద్ర తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. మండలంలోని కెపి పాలెం సౌత్, పేరుపాలెం సౌత్ బీచ్ ప్రాంతాలలో అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశుభ్రత అనేది నిత్యం పాటించవలసిన ప్రక్రియని సూచించారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, డిఎస్‌పి మూర్తికృష్ణ ఉన్నారు.

ముత్యాలపల్లి సర్పంచిగా సూరిబాబు

మొగల్తూరు: ముత్యాలపల్లి సర్పంచిగా అడ్డాల సూరిబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల అనారోగ్యంతో సర్పంచి కోపనాతి పల్లయ్య మృతి చెందారు. ఉప సర్పంచిగా కొనసాగుతున్న సూరిబాబును ప్రభుత్వం సర్పంచిగా నియమించింది. పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య సూరిబాబుకు సర్పంచిగా బాధ్యతలు అప్పగించారు. సూరిబాబును వార్డు సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గణపవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం కాలేజ్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రతపై విద్యార్థులు కాలేజీ ఆవరణలో శ్రమదానం చేశారు. నేను నా దేశాన్ని, రాష్ట్రంతో పాటు జిల్లాను, సొంత ఊరిని స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 పి.ఒ జి.వెంకట రమణ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సస్యరక్షణ చర్యలు

పెనుమంట్ర: ముంపు ప్రాంతాల్లో సత్వర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటను కాపాడుకున్నామని మార్టేరు ఆచార్య ఎన్‌జి రంగా ప్రాంతీయ వ్యవసాయ(వరి) పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరిగిన శిక్షణ, సందర్శన కార్యక్రమంకు ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎడిఆర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో సాగుచేస్తున్న వరిపంట రెండుసార్లు ముంపుకు గురైందని, ఇటువంటి పరిస్థితులలో శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు ముంపు ప్రాంతాలను సందర్శించి, నష్ట నివారణ చర్యలను గురించి ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన శాస్త్రవేత్త(విస్తరణ విభాగం) డాక్టర్ ఎ.వి.కృష్ణాజి సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమన్వయంతో పనిచేయండి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: సమన్వయంతో పనిచేసి తాడేపల్లిగూడెం పట్టణాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని మున్సిపల్ అధికారులకు ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయవాడలో సంభవించిన వరదల వల్ల ఎంతో నష్టం జరిగిందని, అక్కడ ఉన్నవారికి సేవ చేయడంలో వివిధ శాఖల అధికారులతో పాటు పారిశుధ్య సిబ్బంది చేసిన సేవలు అమోఘమని ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు. గత ఐదు సంవత్సరాల్లో మున్సిపాలిటీ నిర్వీర్యమైందని తెలిపారు. గతంలో వాలంటీర్లుగా పనిచేసి రాజీనామా చేసిన వాలంటీర్లను తీసుకోవడం అవకాశం లేదని, రాజీనామా చేయని వాలంటీర్లను వివిధ సచివాలయాల్లో వారిని వినియోగించుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమన్వయంగా పనిచేయాలని తెలిపారు. గతంలో మున్సిపాలిటీకి మంజూరైన నిధులు నిర్వీర్యమైపోయాయని వివరించారు. ఆర్‌డిఒ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 15 రోజులకు ఒకసారి మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ పరిధిలో మంజూరైన నిధులను ఆ మున్సిపాలిటీకే ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్వచ్ఛతా హి సేవా పేరున 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, మానవతా లాయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజల భాగస్వామ్యం ఉండాలని, స్వచ్ఛంద సేవా సంస్థలు పాల్గొనాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

తణుకు: తణుకులో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రతాప్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు అనేక వ్యయ ప్రయాసలకోర్చి పట్టణాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఎంత పనిచేసినా కార్మికుల సమస్యలు అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పరిధికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదని పేర్కొన్నారు. కార్మికులకు ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి 15 రోజులకోసారి మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. కాలానికి అనుగుణంగా రక్షణ పరికరాలు, పని ముట్లు ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమస్యలపై అధికారులు, కార్మికుల ప్రతినిధుల జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. విజయవాడ వరదలకు వెళ్లిన కార్మికులకు ఐదు రోజులు సెలవులు, ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని తెలిపారు. కార్మికులకు సెలవు కచ్చితంగా అమలు చేయాలన్నారు. పండగ సమయంలో గత ప్రభుత్వం ఇచ్చిన రూ.వెయ్యి బోనస్ వెంటనే ఇవ్వాలని కోరారు. కమిషనర్ రామ్ కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. యూనియన్ నాయకులు అధ్యక్షులు అర్జీ కృష్ణబాబు, కార్యదర్శి ఎస్.ఆది నారాయణ బాబు, మండయ్యలు, కొత్తపల్లి అయ్యప్ప, నాగేంద్ర కుమార్, కేశవ, జ్యోతిబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రకటన
మహారాష్ట్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం, ప.గో.జిల్లా.
ఐ.పి.నెం. 7/2024
పిటీషనరు:
పై మద్దుల సత్య శరీర S/o సూర్యనారాయణ, చించినాడ, ...పిటీషనరు
మరియు
కడలి రాజారావు మరియు 33 మంది ఇతరు ...రెస్పాండెంట్సు
పై సంబరు గల రెస్పాండెంట్సు పిటీషన్ పిటీషనరు తనకు గల బాకీలను తీర్చలేని స్థితిలో 34 మంది రెస్పాండెంట్సు పై, దివాలా ఇన్సాల్వెన్సీ పిటీషను దాఖలు చేసియున్నారు. మరియు నోటీసుపై ఇన్సాల్వెన్సీ యాక్టు అండర్ సెక్షన్ 10, 13 ప్రకారము వ్రాతా లిఖిత కోరుచూ దాఖలు చేసియున్నారు. దానిపై క్రెడిటర్లు వారి ఉద్దేశ్యాల కొరకు పైన రెస్పాండెంట్లు 34 మంది రెస్పాండెంట్సుకు గల మీ పై నంబర్ గలుకు గాను, పెట్టి అద్దంతరములు ఉన్నయెడల ది. 04-10-2024 ఉదయం 10.30 ని.లకు మీ స్వయముగా గాని ద్వారా మీ తరపు అద్వకేట్ ద్వారా గాని హాజరై ఐ.పి. నందు అభ్యంతరములు తెలియజేసుకోవలెను. లేనిచో పై పిటిషన్‌ను మీకు వ్యతిరేకంగా నిర్ణయించబడును. దివాలా పత్ర అభియోగ విషయం పిటిషనరును ట్రైడ్ చేయవలెను యుయుమూలయు యాన్ఇందలి తెలియజేయడమైనది.
స్థలం: నరసాపురం
తేది :20-09-2024
లోడపాటి నారాయణస్వామి నాయుడు, పిటీషనరు తరపు అడ్వకేట్, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా, సెల్ : 9949640906

శాంతి సంస్కృతిని అనుసరిద్దాం

ప్రజాశక్తి - ఉండి

సమాజంలో అందరూ శాంతి సంస్కృతిని అనుసరిద్దామని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. మండలంలోని చెరుకువాడ హైస్కూల్‌లో శనివారం ఉండి లయన్స్ క్లబ్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవ వేడుకలు, శాంతి ర్యాలీ, విజేతలకు బహుమతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం ఎం.పార్వతి దేవి అధ్యక్షత వహించారు. లయన్స్ సభ్యులు బుద్ధరాజు సుబ్బరాజు, కాగిత మహంకాళీ, భూపతిరాజు హరినాధ్ రాజు, ఉపాధ్యాయులు ఎస్.మూర్తి, ముదిరాజ్, ప్రకాష్, వెంకటకృష్ణ, సతీష్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు: శాంతి, సంస్కృతి, మంచి అలవాట్లను పెంపొందించేలా అందరూ కృషి చేయాలని దారిదీపం వ్రతిక సంపాదకులు డిడిఎస్.వర్మ అన్నారు. శనివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌కెఎస్‌డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో శాంతి దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్ సుందరేశ్వర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవం ఈనెల 21న జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, విద్యాసంస్థల ప్రిన్సిపల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాలకొల్లు: ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా యునైటెడ్ ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్‌లో పాలకొల్లు వివిధ పాఠశాల విద్యార్థులకు శనివారం చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో విజేతలకు మార్గిన్ జనరల్ స్టోర్స్, నరేష్ టెక్నాలజీస్ బహుమతులు అందచేశారు.

ఏచూరి మృతి కష్టజీవులకు తీరనిలోటు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

సీతారాం ఏచూరి మృతి దేశంలో కష్టజీవులకు తీరని లోటు అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు అన్నారు. శనివారం సివిల్ సప్లై గోడౌన్ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సివిల్ సప్లై గోడౌన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సామంతుల ఉదయ భాస్కర్ రావు అధ్యక్షత వహించారు. అనంతరం వాసుదేవరావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరిది కీలక పాత్రని, విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి పార్లమెంటు బయట, లోపల విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ సారధిగా ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిదని కొనియాడారు. సమాజ మార్పు కోసం విద్యార్థి దశ నుంచి సోషలిజం మార్గాన్ని ఎంచుకుని తాను ఎత్తిన ఎర్రజెండా దించకుండా ఉద్యమించిన యోధుడని తెలిపారు. జిల్లాలో ప్రజలకు, కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఆర్ఎస్ అండగా ఉండేవారన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ అణగారిన వర్గాల కోసం పనిచేయడం ఆయన చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. అమరజీవుల ఆశయాలు ముందుకు తీసుకుపోవడమే ఘనమైన నివాళులని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బప్పడాల యేసు, వెంకట్రావు, మద్ది అప్పారావు, కె.కొండయ్య, సీతారామయ్య శ్రీను పాల్గొన్నారు.

ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

పత్రికా ప్రకటన
మహారాష్ట్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో
O.S.No.182/2019
ప్లెయిన్:
మామిడిశెట్టి రామకృష్ణ మరియు కట్టా కాళావతి ...Plaintiffs
VS
మామిడిశెట్టి వెంకటేశ్వరరావు & 8 గురు ...Defendants
TO:
D-6: శ్రీమతి మామిడిశెట్టి నాగలక్ష్మి, అలియాస్ నీలిమ, తండ్రి: పాపారావు, వందితలిల్లాపు, పోడూరు మండలం, ప.గో.జిల్లా.
పై నెంబరు దావాలో 6వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా సమనులు పంపించిననప్పటికిన్నీ అవి మీకు అమలు జరగనందున, ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావాలో మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల ది.24-09-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి, మీవాదన దాఖలు చేసుకొనవలెను. లేని ఎడల మీ పేర్కొనబడి తదుపరి గ్రంథము జరుపబడును.
(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
జి.వి.సుబ్బారావు, M.Sc., B.L., అడ్వకేట్, వెలమగూడెం, పాలకొల్లు. సెల్: 9849418841

తెలుగు వైతాళికుడు గురజాడ

ఘనంగా 162వ జయంతి

ప్రజాశక్తి - తణుకు

దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటిన తెలుగు వైతాళికుడు గురజాడ అప్పారావని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.దక్షిణామూర్తి అన్నారు. శనివారం స్థానిక అమరజీవి భవనంలో గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు రూపుమాపేందుకు గురజాడ ఎనలేని కృషి చేశారన్నారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జె.చంద్రప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను ఎదిరించిన గొప్ప సంఘసంస్కర్త గురజాడ అని, కన్యాశుల్కం వంటి దురాచారాన్ని ప్రతిఘటిస్తూ గురజాడ రాసిన గొప్ప నాటకం కన్యాశుల్కం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.శేషుబాబు, బిదిలిక్కె.ప్రసాద్, జక్క సుబ్రమణ్యం, ఉష, కామన మునిస్వామి, రంగారావు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య చరిత్రను ప్రభావితం చేసిన నవ్యయుగ యుగ ఆద్యుడు అయితే, గురజాడ అప్పారావు ఆధునికుడని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాతాజీ భాస్కరరావు అన్నారు. శనివారం సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక నెం 13 ప్రాథమిక పాఠశాలలో గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కోట్ల సుందరరామ్ మాట్లాడుతూ చైతన్య సుమాలు పూయించిన తెలుగు వెలుగు గురజాడ అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం విశ్రాంత అధ్యాపకులు కోట్ల సుందరరామ్, స్కూల్ అధ్యాపకుడు ఎస్.విమలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆదూరి రాజరాజేశ్వరి, కళ్ళాణి, బంగారయ్య, నాగమణి, ఉమామహేశ్వరి, సభ్యులు కెవిఎస్‌డి ప్రసాద్, మోహనరావు, అంగోర్ భాష, ఆర్.వి.రామకృష్ణ పాల్గొన్నారు.

గణపవరం: వ్యవహారిక భాషా వికాసానికి గురజాడ ఎంతో కృషి చేశారని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా స్థానిక కాలేజీలో జరిగిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గురజాడ రచించిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం భారతీయ సాహిత్యంలో ఓ మణిపూసని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.చైతన్య, జి.వెంకటరమణ, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు: మహిళల పట్ల సమాజంలో ఉన్న వివక్షతను పారద్రోలడానికి కన్యాశుల్కం నాటకం ద్వారా ఎంతో ప్రచారం నిర్వహించిన సామాజిక సంఘ సంస్కర్త, భాషాభివృద్ధికి కృషిచేసిన త్యాగశీలి గురజాడ అప్పారావు అని ఐద్వా పట్టణ కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంతత ఉదయ్ కుమారి అన్నారు. గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా మండలంలోని దుంపగడప ఎకెఐఎస్ జూనియర్ కళాశాల, ఐద్వా, డివైఎఫ్ఐ ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి అఖిల భారత మహిళా సంఘం పట్టణ కార్యదర్శి సంతత ఉదయ కుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల వివక్షతను పారదోలటానికి కన్యాశుల్కం అనే నాటికను రచించారని అన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారన్నారు. డివైఎఫ్ఐ నాయకులు బొడ్డుపల్లి రాంబాబు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని, తెలుగు భాష వరవడిని ప్రపంచానికి చెప్పిన గొప్ప పండితులు గురజాడ అప్పారావు అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎర్ర కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక అజమూరు గురుకు ప్రాథమిక పాఠశాలలో గురజాడ జయంతి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎస్.నారాయణ విద్యార్థులకు గురజాడ చరిత్రను వివరించారు.

పాలకొల్లు: పాలకొల్లు ఎఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగం వారి ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ అధ్యక్షత వహించారు. గురజాడ అప్పారావు సేవలు కొనియాడారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం, తాడేపల్లిగూడెం సెంటర్స్, తణుకు బెల్‌వెదెర్ విద్యాసంస్థలు రూ.2 లక్షల చొప్పున రూ.6 లక్షల విరాళాన్ని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థలు పెద్ద ఎత్తున విరాళాలను అందజేయడం చాలా అభినందనీయమని కొనియాడారు. జిల్లా విద్యారంగానికి సహాయాన్ని అందజేయడంలోను ముందు వరుసలో నిలవడం చాలా సంతోషించదగిన విషయమని అన్నారు. చెక్కును అందజేసిన వారిలో తాడేపల్లిగూడెం సెంటర్స్ కరస్పాండెంట్ ఎ.విజయ్ కుమార్, తణుకు బెల్ వెదెర్ కరస్పాండెంట్ ఎ.దీపక్ కుమార్ ఉన్నారు.

తాడేపల్లిగూడెం: స్థానిక సుబ్బారావు పేటలో ఉన్న ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల 50 వేల విరాళం శనివారం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులలో ఇటువంటి సేవాగుణం అలవరచడం అభినందనీయమని, చిన్నతనం నుంచి ఇటువంటి కార్యక్రమాలు చేయడం ద్వారా వారిలో, పిల్లలలో సేవాభావం, సామాజిక బాధ్యత పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఆంగ్లో ఇండియన్ స్కూల్ ఛైర్మన్ కొడాలి రమేష్ బాబు రూ.2 లక్షల డిడి ఎంఎల్ఎ శ్రీనివాస్‌కు అందించారు.

DOCUMENT MISSING

As per the instruction of my client **Sri Mullapudi Rama Mohan,** S/o. M.K.V.V Chalam, R/o. Eluru, This publication is here with published as follows **On 21.08.2024** while my client was proceeding from his house at Satrampadu, to Xerox shop located at satrampadu, Eluru for getting Photostat of a document bearing **No .1239/2002** dated **14.08.2002** and it was observed that the said document was missing .

Therefore, if the said document was identified by any one , please return in to my client .

E.SRINIVASA BABU Advocates
Eluru , 9440188498

వేలం ప్రకటన
మహారాష్ట్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.2 of 2019 in O.S.No.25 of 2015
ప్లెయిన్:
అద్దగళ్ల విజయ కుమార్ ...పిటీషనరు /డి.హెచ్.ఆర్ /వాది
అండ్
నెల్లి భారతి ...రెస్పాండెంట్ /జె.డి.ఆర్ /ప్రతివాది
పై నెంబరు దావాలో డిక్రీ ద్వారా /రెస్పాండెంట్ డి.హెచ్.ఆర్ కి రావలసిన డిక్రీ బాకీ, ఖర్చులు మరియు వడ్డీతో సహా రాబట్టుకొనుటకు గాను, జె.డి.ఆర్. స్వాధీనంలో గల ఇ.పి. షెడ్యూలు స్థిరాస్తిని ది.03-10-2024 సంవత్సరం తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు లాగాయతు పై కోర్టు వారి ఎదుట వేలం పాట వేయబడును. కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులు తెలుసుకొని వేలం పాటలో పాల్గొని పాడ వలసినదిగా తెలియజేయడమైనది.
షెడ్యూలు ఆస్తి వివరం
పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో చేరిన నరసాపురం పట్టణం, నరసాపురం మునిసిపల్ లిమిట్స్‌లోని రుస్తుంబాద, 28వ వార్డులోని, ఆర్.ఎస్.నెం.136/6లోని, డి.నెం.13-3-16 గల అసెస్మెంట్ నెం.5928కు గల చ॥గ॥218 గల స్థలమున్ను అందులోని తాటాకులు ఇల్లు హద్దులు: తూర్పు: వంట బోదె, పడమర: ఉంగ్రాజువారు మరియమ్మ తాలూకు ఆస్తి, దక్షిణం: కాలవ, పోరంబోకు. ఉత్తరం: శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం వారి ఆస్తి. ఈ హద్దుల మధ్య చ॥గ॥218 గల స్థలమున్ను అందులోని తాటాకులు ఇల్లున్ను సదరు ఇంటి అంటియున్న యావత్తు గృహోపకరణములు సహా వేలం వేయబడును.
డి.హెచ్.ఆర్. విలువ : రూ.4,00,000/-
అమీనా విలువ : రూ.9,00,000/-
కటికరెడ్డి కరుణ్ కుమార్
నరసాపురం, 18-9-24.
అడ్వకేట్, నరసాపురం సెల్: 9441922459

'ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాలన'

పాలకొల్లు: పాలకొల్లు నియోజకవర్గంలో ఇది మంచి ప్రభుత్వం అంటూ వేలాదిమంది రైతులు 100 మీటర్ల పచ్చని జెండాతో శనివారం జరిగిన భారీ ర్యాలీలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. పూలపల్లి రైస్‌మిల్లు నుంచి భోగేశ్వరం వరకు జరిగిన ర్యాలీలో రైతులు పచ్చని జెండాలు చేతబట్టి దాదాపు 3 కిలోమీటర్లు పొడవున నడిచారు. దీపావళి పండుగ కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తామని, సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, నాయకులు జీవి పాల్గొన్నారు.

మొగల్తూరు: 100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను తెలపడమే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వృద్ధులకు పెన్షన్ పెంపు, బడుగు బలహీన వర్గాలకు అన్నా క్యాంటీన్ ద్వారా నాణ్యమైన ఆహారం అందించడం తదితర మహత్తర కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ఆమె అన్నారు. అనంతరం ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం అని అన్నారు. ఇది మంచి ప్రభుత్వమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. అనంతరం పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, అడ్డాల సూరిబాబు, పొత్తూరి రామరాజు ఉన్నారు.

వీరవాసరం: వైసిపికి భవిష్యత్ లేదని, చరిత్రలోని పార్టీగా మిగిలిపోనుందని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో భాగంగా శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంజిబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని, అయినప్పటికీ వైసిపి నాయకులకు బుద్ధిరాలేదన్నారు. ఎన్నికలకు ముందు ఏమైనా చేయగలం అనుకుంటే ప్రభుత్వం వైసిపి అన్నారు. జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, సర్పంచి భూపతిరాజు సత్యనారాయణ రాజు, టిడిపి నాయకులు కోళ్ళ నాగేశ్వర్రావు, మేడిదే పార్వతి సారధి పాల్గొన్నారు.

ఆచంట: దీపావళి నుంచి మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పూర్తిచేసుకున్న సందర్భంగా కొడమంచిలి రైతు సేవా కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ డి.సుగుణ సంధ్య, పంచాయతీ కార్యదర్శి డి.నాని, టిడిపి నేతలు మన్నే సత్యనారాయణ మూర్తి, బాలం వెంకటరమణ పాల్గొన్నారు.

ఉండి: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అవడంతో ఇది మంచి ప్రభుత్వం అనే పేరుతో కార్యక్రమాన్ని పెదపుల్లేరు గ్రామంలో మండలంలోని కలిగొట్ల, వాండ్రం, పెదపుల్లేరు, చిన్నపుల్లేరు, ఉండి కొత్తపేట గ్రామాలలో కూటమి నాయకులు, జనసేన నాయకులు కార్యక్రమాన్ని పండగే చేశారు. కలిగొట్ల గ్రామ సర్పంచి ఎంఎస్, నాయకులు పెద్దింటి బాబు, కలిదింది భాస్కరరాజు, యడల కృష్ణయ్య, సంధర నాగరాజు పాల్గొన్నారు.

గణపవరం: మండలంలోని సరిపల్లిలో శనివారం టిడిపి, జనసేన కూటమి నాయకులు మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప సర్పంచి కొల్లి కృష్ణసాయి ప్రభుత్వం చేసిన వందరోజుల పనులను వివరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు, అడబాలనారాయణ, నల్లగి సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తి అయిన సందర్భంగా శనివారం అత్తిలి మండలం అత్తిలిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిపూడి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడే మంచి ప్రభుత్వమని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S. Shriram Finance Ltd., Aswaraopeta Branch Rep. by its Branch Manager it is Stated that Nali Gangaratnam, W/o. Nali Satyanarayana, 37 Years, Occ. House hold, R/o. Papidigudem Village, Utlapalli Grama Panchayath, Aswaraopet Mandal, Bhadradri Kothagudem District, is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 3 days form the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

Thatties roofed house bearing Assessment No.1142019199 (Old H.No.13-16) in a plinth area of 390 Sq. Feet in the house site to an extent of 215 Sq. Yards or 180 Sq. Mts in R.S.No. 482-2B situated at Jangareddigudem Village and Mandal, West Godavari District, SRO limits of Jangareddigudem bounded by:
EAST: 5 Yards width Road left by Talari Venkanna and Others 31'-6". **SOUTH:** Place of Talari Seshaiah 60'. **WEST:** Place of Gullapudi Raja 33". **NORTH:** Place of Talari Srinu 60'.

Kothagudem,
Dt.21-09-2024.

P.GANESH BABU, ADVOCATE,
Kothagudem. Cell: 98492 46278

మండల ప్రజా పరిషత్ కార్యాలయము, భీమడోలు
A1/26/2024, తేదీ.19-09-2024
టెండరు నోటీసు ప్రకటన
ఏలూరు జిల్లా, భీమడోలు మండలము, పూళ్ళ గ్రామములో గల మండల పరిషత్, భీమడోలు వారి షాపింగ్ కాంప్లెక్స్ నందలి 5 షాపులకు ది.01-10-2024 తేదీ నుండి 3 సంవత్సరములు అనగా ది.30-09-2027వ తేదీ వరకు (2024-27) గల కాలమునకు అద్దె ప్రాతిపదికన ఇచ్చుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీల్డ్ టెండర్లు అద్దె రోజు ఉదయం గం॥11:00ల నుండి మధ్యాహ్నం గం॥3:00ల వరకు స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం॥4:00లకు హాజరైన టెండరు దారుల సమక్షంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయము, భీమడోలు నందు తెరువబడును. మిగిలిన వివరములకు మండల ప్రజా పరిషత్ కార్యాలయము భీమడోలు నందు కార్యాలయ పనివేళలలో సంప్రదించవలసినదిగా తెలియజేయనైనది.
సం/- మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్, భీమడోలు.